# కల్యాణ కారకుడు

శ్రీపాద కృష్ణమూర్తి

కథానిక

ఐదేండ్లనాటి మాట. భాస్కరం బి. ఇ. పరీక్షకు కూర్చుని వేసంగి సెలవులకి యింటికి వచ్చాడు. కుశలప్రశ్న లయిన తరువాత భోజనము ముందు కూర్చున్నాము. అన్నం తినడం ప్రారంభించామో లేదో మా పినతల్లి "సుందరముగారమ్మాయి పద్మని చూచిరా నాయనా! పిల్ల సీతామహాలక్ష్మిలాగ ఉంటుంది" అన్నది.

"ఉహుఁ!" అన్నాడు భాస్కరం తలకాయ అడ్డముగా తిప్పుతూ.

"అదేమిరా?" ఆశ్చర్యము ప్రకటిస్తూ అన్నది మా పిన్నమ్మ.

"ఏమీ లేదు" అని రెండునిమిషాలు నిశ్శబ్దంగా ఉండి "చదువు పూర్తి అయితేనేకాని పెళ్ళిచేసుకోను" అన్నాడు.

"చదువుకీ పెళ్ళికీ సంబంధం ఏమిటిరా? నీ చదువుకి యే భంగమూ కలుగకుండా నిర్విఘ్నంగా కొనసాగేటట్టు నేను చూస్తానుగా. ఒకసారి వెళ్ళి చూసిరా!" అన్నది.

"వద్దమ్మా! ఇప్పుడప్పుడే పెళ్ళికి తొందర యేమిటి? చదువు పూర్తి అయి ఉద్యోగంలో ప్రవేశిస్తేనేకాని పెళ్ళిచేసుకోను" అన్నాడు.

ఈ జవాబు వలన ఆమెకు సంతృప్తి కలుగలేదు. ఐదునిమిషాలు నిశ్శబ్దముగా గడిచాయి. భాస్కరం భోజనం ముగించుకొని లేచాడు.

"పెద్దవాళ్ళు చెప్పినమాట వినడం ఎప్పుడూ లేదుకదా!" అన్నది విసుగుకొంటూ.

భాస్కరం మెదలకుండా వెళ్ళిపోయాడు నవ్వుకొంటూ. ఆమె రెండుమూడు నిమిషాలు అతడు వెళ్ళినవైపే చూస్తూ నిలబడింది.

"మంచినీళ్లు పిన్నీ!" అన్నాను కొంచెము భయపడుతూ. మంచినీళ్లు అందించుతూ "నువ్వు కూడా ఒకసారి చెప్పిచూడు నాయనా!" అన్నది.

"పెద్దదానవు. నీమాట చెవిని పెట్టనివాడు నా మాట వింటాడా? ఐనా సమయం కనిపెట్టి చెప్పి చూస్తానులే పిన్నీ" అన్నాను.

"ఏదో ఒకవిధముగా వాడు ఒప్పుకునేటట్టు చెయ్యి నాయనా!" అన్నది.

ఆ మాటలలో యెంతో ఆవేదన ఉన్నది. మా తారకం బాబు, భాస్కరం చిన్నతనంలోనే ఇహలోకముతో తన సంబంధాన్ని తెంచుకొని చనిపోయాడు. అప్పటినుంచీ మా పినతల్లి ఎన్నో కష్టాలను యెదుర్కొంటూ, ఉన్న ఆస్తి దాయాదుల పాలు కాకుండా జాగ్రత్తగా నిర్వహించుతూ భాస్కరాన్ని ఇంతవాణ్ణి చేసింది. ఇప్పుడు ఆమె ఆరోగ్యం చెడిపోయింది. ఎక్కువ కాలము జీవించే ఆశకూడా లేదు. ఆమె జీవితం మీద ఆమెకే నమ్మకములేదు. కొడుకు పెళ్ళిచేసి యింటిపెత్తనం కోడలికప్పగించి తాను నిశ్చింతగా ఉండాలని ఆమె కోరిక.

పాపం ఆమె మాట కద్దు చెప్పలేక పోయాను. ఏదో విధముగా భాస్కరాన్ని వివాహానికి సుముఖుణ్ణిగా చేయాలని నిశ్చయించుకొన్నాను. భోజనము ముగించుకొని బైటికి వచ్చాను.

* * *

రామేశంగారు తణుకులో పేరుమోసిన ఉపాధ్యాయులు. భాస్కరం ఆయన శిష్యకోటిలోని వాడూ, ఆయనయందు అమితమైన గౌరవము కలవాడూను.

ఏ ఉపాయమూ తోచక రామేశంగారికి భాస్కరం పెళ్ళి విషయం తెలియపరచి ఆయనను తోడ్కొని వచ్చాను.

"భాస్కరం! పెళ్ళిచేసుకోనని మీ అమ్మగారి మనస్సు కష్టపెడుతున్నావు టేమిటి?" అని ప్రశ్నించారు భాస్కరాన్ని రామేశంగారు.

భాస్కరం ఏమీ మాట్లాడలేక పోయాడు. ఇంతలో మాపినతల్లివచ్చి "అన్నగారూ! మీరైనా చెప్పండి, నామాట బొత్తిగా వినడంలేదు" అన్నది.

"పెళ్ళి చేసుకోనడానికి బెదిరి పోతున్నావు టోయ్! వెఱ్ఱివాడా! వివాహ జీవితంలో ఉన్న మాధుర్యం, సుఖం అర్థంచేసుకోలేక పోతున్నావు. ఒంటరిగా జీవించేవారే వివాహితులకన్నా మానవ సేవ చేయగలరని మాబోటి యువకులు భ్రాంతి పడుతూ ఉంటారు. అది పట్టి భ్రాంతి సుమా! పెళ్ళిచేసుకొని సుఖంగా జీవించవచ్చు. పెళ్ళి మాట తరువాత ఆలోచించవచ్చును కాని ప్రస్తుతము పిల్లనిచూచిరా! ఏమంటావు?" అన్నాడు.

ఆయన మాటకు ఎదురాడలేక "సరే మీయిష్టం" అన్నాడు అసంతృప్తితో భాస్కరం.

మా పిన్ని ముఖం సంతోషంతో కలకలలాడింది. కన్నులు చేరడేసి చేసుకొని విజయం నేనే సాధించినట్టు పిన్నివైపు సగర్వంగా చూశాను.

భాస్కరం తనపంతము వీగిపోయిందనే అసూయతో బయటకు వెళ్ళిపోయాడు.

రామేశంగారుకూడా అక్కడనుంచి నిష్క్రమించారు.

• • •

రెండురోజులు గడిచిపోయాయి. ఒకరోజున మధ్యాహ్నం మూడు గంటలయింది. రామేశంగారూ, భాస్కరం, నేను ముస్తాబయి పెళ్ళిచూపులకి వెళ్ళాము.

బండి దిగగానే "రండి, రండి!" అంటూ పిల్ల తండ్రి సుందరంగారు మాకు ఎదురుగావచ్చి లోపలికి తీసుకొనివెళ్ళారు. రామేశంగారూ, సుందరంగారూ యేవేవో విషయాలు ముచ్చటించుకున్నారు.

మూడునాలుదు నిమిషాలు గడిచినపిమ్మట "ఏదిరా పెళ్ళికూతురు!" అన్నాను కాబోయే వదినగారిని చూడాలనే ఉబలాటంతో.

భాస్కరానికి నవ్వువచ్చింది. వచ్చే నవ్వుని ఆలికష్టంమీద అపుకొని "మాట్లాడకు" అన్నట్లు నాకు సంజ్ఞ చేశాడు.

ఇంతలో యేళ్లునిండిన ఒక పండు ముసలాయన వచ్చి భాస్కరాన్ని "నీ పేరు ఏమిటి నాయనా?" అని అడిగాడు అస్పష్టమైన ఉచ్చారణతో.

"భాస్కరరావు."

"ఏమి చదువుతున్నావు?"

"బి. ఇ. పరీక్షకు కూర్చున్నాను."

పెద్దచదువే అన్నట్టు ముసలాయన సంతృప్తితో తల ఊపాడు. ఇంతలో సుందరంగారు వచ్చి "ఫలహారం తీసికోనిరా!" అన్నారు. రామేశంగారు "మేము పిల్లని చూద్దామని వచ్చాముకాని ఫలహారం చేద్దామని కాదండోయ్!" అంటూ పరిహాసం చేశారు.

నిజంచెప్పాలంటే నాకు మాచెడ్డ కోపంవచ్చింది. ఆయనకు అవసరంలేకపోతే యింకెవరికీ కూడా అవసరంలేదు అనుకున్నారు కాబోలని లోలోపల రామేశంగారిని తిట్టడం ప్రారంభించాను.

ఈ సంగతి తెలుసుకున్నదో యేమో గృహిణి ఫలహారం, కాఫీ తీసుకొని వచ్చింది.

ఒక్క నిమిషంలో పళ్ళెమూ, కప్పూ ఖాళీ చేసి భాస్కరంవైపు చూశాను. భాస్కరం సిగ్గుపడ్డట్టున్నాడు. ఫలహారం ముట్టుకోలేదుకాని కాఫీ మాత్రం తాగాడు. మొహమోటము విడిచి ఆ పళ్లెముకూడా ఖాళీచేసేశాను నేను.

ఇంతలో పిల్లని తీసుకొనివచ్చారు. ఆడవాళ్ళకి సహజమూ, అలంకారమూ అయిన సిగ్గుతో మునివేళ్ళ గడ్డమునకాన్చి తలవంచుకొని పొందికగా కూర్చున్నది.

నేను తల పైకియెత్తి పిల్లవైపు చూశాను.

పున్నమనాటి చంద్రునివంటి గుండ్రని మొహం, విల్లులా వంగిన కనుబొమలు, కలువలవంటి నల్లని కాటుక కళ్ళు, దబ్బపండువంటి చాయ. కనకాంబరం రంగు పట్టుచీరకట్టి జార్జెట్ జాకెట్ తొడుక్కుంది. చక్కని హేరాయిల్ వాసనతోకూడా ఆమె నల్లని తలలోని తెల్లని మల్లెపువ్వుల వాసన గుప్పున కొడుతోంది...ఒక్కమాటలో చెప్పాలంటే ఆమె నిత్యమల్లెపువ్వులా నిగనిగలాడుతోంది.

"పిల్లని చూడరా" అన్నట్టు మా భాస్కరానికి సంజ్ఞ చేశాను. సిగ్గుపడుతూ చిరునవ్వు తొలకాడే మొహం పైకి యెత్తి పద్మవైపు కళ్లుతిప్పాడు. సరిగ్గా అప్పుడే పద్మకూడా భాస్కరం వైపు చూసింది. ఇద్దరి చూపులూ కలిసినాయి. వాళ్ళ హృదయాలు నిశ్శబ్దంగా పల్కరించుకున్నాయి. ఆ మధుర క్షణములో ఆ యిద్దరి అంతరాత్మల్లోని ఊహాలూ వారికే తెలియాలి. లేకపోతే ఆ సర్వాంతర్యామికైనా తెలియాలి.

"అమ్మాయీ! నీ పేరేమిటమ్మా?" అని ప్రశ్నించారు నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ రామేశంగారు.

"పద్మావతి" అంది సన్నని గొంతుతో ఒక నిమిషం మెదలకుండా ఉండి.

"ఏం చదువుతున్నావు?"

"ఎస్. ఎస్. ఎల్. సి. ప్యాసయిందండి. హిందీ కూడా బాగావచ్చు. 'విశారద' ప్యాసయింది" అన్నారు సుందరంగారు, పద్మ సిగ్గుతో ఉబ్బిబ్బు పడడంచూచి.

"పాటలేమైనా వచ్చునా అమ్మా!"

"ఆఁ! వచ్చునండి. పాటలు చాలా చక్కగా పాడుతుంది. ఫిడేలు కూడా వాయించగలదండి" అని జవాబిచ్చింది పిల్లతల్లి.

"అలాగా! అయితే ఏదీ? ఒకపాట పాడమ్మా!" అని అడిగారు రామేశంగారు.

పాపం పద్మ సిగ్గుపడింది. అందులో ఆ సమయంలో సిగ్గుపడకుండా యే స్త్రీ ఉంటుంది! రెండు మూడు నిమిషాలు వరకూ మెదలండా కూర్చుంది.

"ఊఁ! అమ్మాయి ఒక్కపాట పాడేసెయ్యి" అన్నారు సుందరంగారు. అప్పటికీ పద్మ పాడడం ప్రారంభించనేలేదు.

ఇంతలో తల్లి ఫిడేలు తీసుకొనివచ్చి పద్మ ముందర పెట్టుతూ—

"పెద్దవారు అడుగుతూ ఉంటే... ఊఁ! వచ్చిన పాటేయి" అన్నది.

సంగీతం అంటే నేనూ భాస్కరం కూడా చెవి కోసుకుంటాము. అందుచేత మేమిద్దరమూ పాట వినాలని కుతూహలంతో కూర్చున్నాము.

ఫిడేలు శ్రుతి సరిచేసి గొంతుక సవరించి కంఠమెత్తి "రామాభిరామ..." అనే త్యాగయ్యకృతి పాడడం మొదలు పెట్టింది. ఆమె తియ్యని సన్నని కంఠస్వరము ఫిడేలు స్వరములో లీనమైపోయింది. పాట పాడే అంతసేపూ నేనూ మా భాస్కరమూ ముగ్ధులమై పోయాము, నాగస్వరం వినే నాగుపాముల్లాగ. పాట పూర్తికాగానే ఫిడేలు అక్కడనే ఉంచివేసి పద్మ పక్షిలా రివ్వున లోపలికివెళ్ళి పోయింది.

భాస్కరం తన ఉద్దేశ్యం పూర్తిగా మార్చుకుని ఉంటాడు. అతని ముఖం సంతృప్తితోను, సంతోషంతోనూ కలకలలాడింది—చంద్రుడు ప్రకాశించగానే కలువలు కిలకిలా నవ్వేటట్లు.

నాలుగయిదు క్షణాలు గడిచాక ఇంటికి బయలుదేరాము. సుందరంగారు "ఏ సంగతీ వీలైనంత త్వరగా తెలియపరచండి" అన్నారు మమ్మల్ని సాగనంపుతూ, ఆ ముఖంలో ఆడపిల్ల పెళ్ళి చేయడానికి ప్రతి తండ్రీ పడే బాధ అంతా వ్యక్తమయింది.

"అలాగే" అని "మరిచిపోయాను. మీ గోత్రము ఏమిటండీ సుందరంగారూ?" అని ప్రశ్నించారు రామేశంగారు.

మా బండితోపాటు రెండు మూడడుగులు కంగారుగా వేస్తూ "భారద్వాజ సగోత్రమండీ!" అన్నారు సుందరగారు.

మా బండి కనబడేవరకూ అక్కడే నిలబడి సుందరంగారు వెళ్ళిపోయారు.

* * *

రాత్రి తొమ్మిది గంటలకి ఇల్లు చేరుకున్నాం. "పిల్ల ఎలా వుందిరా నాయనా?" అని అడిగింది మా పిన్ని. భాస్కరం మెదలకుండా కూర్చున్నాడు నవ్వుకొంటూ.

"అమ్మాయి నీకు నచ్చిందిరా?" అని నన్నడిగింది పిన్ని.

"అమ్మాయి నాకు నచ్చింది పిన్నీ" అని "పాట ఎంత బాగా పాడిందనుకున్నావు?" అన్నాను.

భాస్కరం కూడా నాతో యేకీభవించాడు.

"అయితే పిల్ల నచ్చిందన్న మాటే!" అంది ముఖం యింత చేసుకొని.

ఇంతలో రామేశంగారు "మీ గోత్ర మేమిటండీ?" అని ప్రశ్నించారు.

"భారద్వాజ సగోత్రమండీ!" అన్నది.

"పిల్ల నచ్చినా ఇక ప్రయోజనం లేదు-వారిదీ భారద్వాజ సగోత్రమేనట. గోత్రాలు కలిసిపోయాయి" అన్నారు నిస్పృహతో రామేశంగారు.

ఆ మాట వినేసరికి ఒక్క నిమిషం వెనుక కలకలలాడిన మా పిన్ని ముఖం పరిమళం చెడి వాడిపోయిన పువ్వులా అయిపోయింది.

"అయితే వదులుకున్నట్లే" అంది పిన్నమ్మ దీర్ఘంగా నిట్టూర్చుతూ.

మా యిద్దరికీ చెప్పలేనంత కోపం వచ్చింది, "ఈ రోజుల్లో కూడా ఇంకా యీ మూఢ నమ్మకాలూ, అంధవిశ్వాసాలూ ఏమిటి? కాలం మారిపోయినా ఈ ముసలివాళ్ళు మాత్రం మారలేదు. ఇంకా మూర్ఖుల్లాగే ఉన్నారు" అనుకున్నాము.

"మరొక సంబంధం చూసుకోమని సుందరం గారికి ఉత్తరం వ్రాయవోయ్!" అని చెప్పి రామేశం వెళ్ళిపోయారు.

* * *

నాలుగు రోజులు గడిచాయి. భాస్కరం సుందరంగారికి ఉత్తరం వ్రాయాలని టేబిలుముందు కూర్చున్నాడు.

"పోస్టు" అని పిలుపు వినబడింది. పరుగెత్తుకొని వెళ్ళి ఒక కవరు తెచ్చి భాస్కరం చేతికిచ్చాను.

భాస్కరం కవరువిప్పి చదువుకుని నవ్వుకుంటూ ఉత్తరం నాకందించాడు. అది సుందరంగారు వ్రాశారు.

"చి। భాస్కరరావుకి—

ఆశీర్వచనములు. మీవద్ద నుంచి ఉత్తరమేమీ రాలేదు... నిన్ననే మా అమ్మాయి చి। పద్మకి వివాహం నిశ్చయించుకుని తాంబూలాలు పుచ్చుకున్నాము. మీ అమ్మగారికి యీ విషయము తెలియపఱచవలసినదిగా కోరుతున్నాను.

సుందరరావు."

ఉత్తరం మా పిన్నికి చదివి వినిపించాను.

"పోనీలే! అదృష్టవంతురాలు." అంటూ మా పిన్ని వెళ్ళిపోయింది దిగులు పడుతూ.

* * *

ఈ ఐదేళ్ళల్లోనూ భాస్కరం వందలకొలదీ సంబంధాలు చూశాడు. కాని ఆశ్చర్యం! భాస్కరం చూసివచ్చిన ప్రతికన్యకీ సంబంధాలు స్థిరపడి వివాహాలు జరిగిపోతున్నాయి. మా భాస్కరం మాత్రం ఈరోజుదాకా బ్రహ్మచారిగానే ఉండిపోయాడు.

అంతవరకూ తమతమ కన్యలకు పెళ్ళిళ్లుకాని కారణంచేత బాధలు పడుతూఉన్న తల్లిదండ్రులు మా భాస్కరంలో యేదో మహాత్మ్యం ఉందనుకొని ఉంటారు. బహుశః మనస్సులో "నూరేళ్లు జీవించు నాయనా!" అని ఆశీర్వదించి ఉంటారనుకుంటాను. కాకపోతే వీడు మెట్టిన గడపల్లా వివాహమండపం అవడం యేమిటి!

మళ్ళీ క్రిందటి వేసంగి సెలవులకు పిన్నిగారి ఊరు వెళ్ళాను. కాళ్లు, ముఖం కడుక్కొని కాఫీ తాగుతున్నాను.

ఇంతలో భాస్కరం నీటుగా ముస్తాబయి నవ్వుతూ "వస్తావురా తమ్ముడూ!" అన్నాడు.

"ఎక్కడికీ" ఆశ్చర్యపడుతూ అడిగాను.

"పెళ్ళి చూపులకి" అన్నాడు భాస్కరం పెదవులలో చిరునవ్వు ఒలికించుతూ.

క్షణకాలం ఆలోచించి "సరే! పద!" అని బయలుదేరాను, తమతమ కన్యలకి పెళ్ళిళ్ళు కాలేదని బాధపడే తల్లిదండ్రుల కష్టాలయినా తీరగలవనే ఆశతో!

---

## బెంజమిన్ ఫ్రాంక్లిన్ సుభాషితాలు

"ఒక వ్యక్తి ఎంత చతురుడైనప్పటికీ, చచ్చేదాకా దుర్మార్గుడుగా బతుకుతూ తన దుర్మార్గాన్ని ప్రజలు గ్రహించకుండా ఆసాంతం వారి కళ్లు కప్పడం అసాధ్యమని నా నమ్మకం. ఎవరో ఒకరు ఎలాగో ఒకలాగు అతడి దుర్మార్గాన్ని పసికట్టకపోరు. సత్యానికి, నిజాయితీకి స్వకీయమైన తేజస్సు ఒకటి వుంది. సత్యంగాను, నిజాయితీగాను ఇతరమైనవాటిని చలామణి చేయడం సాధ్యంకాదు. సత్యం, నిజాయితీలు అగ్ని, జ్వాల, వంటివి. వాటిని చిత్రించడం సాధ్యపడదు."

* * * *

"గొప్పవాళ్ళం కావడానికి ఎంత శ్రద్ధ వహిస్తామో మంచివాళ్ళం కావడానికి కూడా అంత శ్రద్ధ వహిస్తే మంచి వాళ్ళం కావడంవల్ల నిజంగా గొప్పవాళ్ళం మనం కాగలం. సత్పురుషుల సంఖ్య బాగా పెరుగుతుంది. మంచితనం లేకుండా గొప్పవాళ్ళం కాగలమనుకోనడం గొప్ప పొరబాటు. నిజంగా మంచివాడు కాని, నిజమైన గొప్పవాడెవ్వడూ ఇంతవరకూ లేడని నేను ఖాయంగా చెప్పగలను."